క్లుప్తంగా

నేడు పాఠశాలల పునఃప్రారంభం

అర్ధవీడు: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు గురువారం పునః ప్రారంభిస్తున్నట్లు ఎంఈఓ అబ్దుల్ సత్తార్ తెలిపారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కిట్లను ప్రధానోపాధ్యాయులు అందజేస్తారని తెలిపారు. కౌన్సెలింగ్‌లో పాల్గొనే ఉపాధ్యాయులు మినహా మిగిలిన ఎస్జీటీలు తమ పాత పాఠశాల్లోనే హాజరు కావాలని బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

14 నుంచి విద్యార్థులకు బస్‌పాసులు

మార్కాపురం: ఈనెల 14వ తేదీ నుంచి మార్కాపురం ఆర్టీసీ డిపో పరిధిలో విద్యార్థులకు బస్‌పాసులు ఇవ్వనున్నట్లు డీఎం ఏఎస్ నరసింహులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు బస్‌పాస్ అప్లికేషన్ ఆన్‌లైన్‌లో నింపి, ఫారం నంబర్‌ను కౌంటరు వద్ద తెలియజేస్తే త్వరితగతిన బస్‌పాసులు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యోగాతో ఆరోగ్యకరమైన జీవితం



మోక్షగుండంలో యోగాపై శిక్షణ ఇస్తున్న సచివాలయ సిబ్బంది

బేస్తవారిపేట: జీవితానికి యోగా తోడైతే ఆనందకరంగా ఉంటుందని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు పేర్కొన్నారు. బుధవారం బేస్తవారిపేట మండలంలోని సచివాలయాల్లో రెండో దశ యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మోక్షగుండం సచివాలయాన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏటీఓ



ఖాదర్‌వలి

మార్కాపురం: మార్కాపురం అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా ఎం.ఖాదర్‌వలి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాయచోటి నుంచి మార్కాపురానికి బదిలీ అయ్యారు. ఏటీఓ మాట్లాడుతూ.. ట్రెజరీలో వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బుధవారం స్థానిక స్థానిక కౌన్సిల్ హాల్లో నిర్వహించిన ఎన్నికలో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా డీఆర్ఓ ఓబులేసు వ్యవహరించారు. ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా సభ్యులు రాకపోవడంతో సాయంత్రం 3 గంటలకు వాయిదా వేశారు. కూటమికి అనుకూలంగా 19 మంది నిలవగా, ఐదుగురు తటస్థంగా వ్యవహరించారు. ఎన్నికను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియాను పోలీసులు అనుమతించలేదు. అదే సమయంలో కూటమికి చెందిన నాయకులు సుమారు 20 మంది లోపలికి వెళ్తున్నా పోలీసులు పట్టించుకోలేదు.

గడప దాటని పొగాకు

- కొమరోలు మండలంలో ఇళ్లకే పరిమితమైన పొగాకు బేళ్లు
- గిట్టుబాటు ధర దక్కకపోవడంతో రైతుల్లో నిరాశ
- రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలని వినతి



ఎన్.బొంతపల్లెలో ఓ నివాసంలో భద్రపరచిన పొగాకు బేళ్లు

కొమరోలు:

గత ఏడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెట్టిన పెట్టుబడికి రెట్టింపు ఆదాయాన్ని కళ్లజూసిన రైతులు.. కూటమి పాలనలో గిట్టుబాటు ధర దక్కక లబోదిబోమంటున్నారు. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంట ఉత్పత్తులను ఆశించిన ధరకు అమ్ముకోలేక సతమతమవుతున్నారు. మిర్చి, శనగ, మొక్కజొన్న పంటల సాగుతో రైతులు నష్టాలు మూటగట్టుకోగా.. పొగాకు రైతులకూ అదే పరిస్థితి ఎదురవుతోంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి పొగాకు ధరలు తగ్గించడంతోపాటు బేళ్లను పదేపదే తిరస్కరిస్తుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇళ్లకే పరిమితమైన బేళ్లను చూపుతూ నిర్వేదానికి లోనవుతున్నారు.

గత ఏడాది రబీ సీజన్‌లో కొమరోలు మండలంలో సుమారు 200 హెక్టార్లలో పొగాకును రైతులు సాగు చేశారు. పంట పుష్కలంగా చేతికి వచ్చిందన్న ఆనందం రైతుల్లో ఎంతోకాలం నిలువలేదు. నాణ్యత లేదని సాకుగా చూపుతూ పొగాకును కొనుగోలు చేయడం లేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు.

మండలంలోని పొగాకు రైతులు పొగాకు పంట చేతికి వచ్చిన వెంటనే నంద్యాల పొగాకు వేలం కేంద్రానికి తీసుకువెళ్తారు. కానీ ఈ ఏడాది పండించిన పంటను తిరస్కరిస్తుండటంతో రైతులు తమ గృహాల్లోనే బేళ్లనే నిల్వ ఉంచారు. ఇడమకల్లు, ముక్తాపురం, రాజుపాలెం, బసువపల్లె, అయ్యవారిపల్లె, ఎన్.బొంతపల్లె, నల్లగుంట్ల, అక్కపల్లె, తాటిచెర్ల, దద్దవాడ గ్రామాల్లో ఒక్కో ఇంట్లో పదుల సంఖ్యలో బేళ్లు నిల్వ ఉన్నాయి. గిట్టుబాటు ధర రాకపోతుందా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. పొగాకు రైతుల సమస్యలు తెలుసుకుని, వారికి మద్దతుగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పొదిలి వేలం కేంద్రాన్ని బుధవారం సందర్శించడంతో గిట్టుబాటు ధరపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



అక్కపల్లెలో ఓ ఇంట్లో పొగాకు బేళ్లు



ముక్తాపురం గ్రామంలో..

మార్క్‌ఫెడ్ పేరుతో సర్కారు మాయ

పొగాకుకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతో రైతులు ధర్నాలకు దిగుతూ, బేళ్లను రోడ్లపై తగలబెట్టి నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. ఇటీవల రాచర్లలో కొందరు రైతులు పొగాకుకు నిప్పుపెట్టి తమ నిరసన తెలియజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలువురు పొగాకు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వేలం కేంద్రాల్లో రైతులు ఆందోళనకు దిగుతూ పొగాకు కంపెనీల తీరును ఎండగడుతున్నా కూటమి ప్రభుత్వం ఆచితూచి స్పందిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. వ్యవసాయశాఖ మంత్రితోపాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రులు సైతం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించుతామని మాటలు చెప్పడమే కానీ ఆచరణలో అటువంటిదేమీ లేకపోవడంతో రైతుల్లో తీవ్ర నిరాశా నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాదిరి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకుకు గిట్టుబాటు ధర దక్కేలా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

డ్రోన్‌తో సులువుగా పురుగుమందు పిచికారి



మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీ నాయక్

మార్కాపురం: డ్రోన్ల సహాయంతో రైతులు పురుగు మందులను సులభతరంగా పంటలపై పిచికారీ చేసుకోవచ్చని బాపట్ల వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మోరధర్‌నాయక్ పేర్కొన్నారు. మార్కాపురం మండలంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నోడల్ ఆఫీసర్ కె.సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త మాట్లాడుతూ.. నంద్యాల వ్యవసాయ పరిశోధన సంస్థలో శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు మంచి రకాలను ఎంచుకోవాలని సూచించారు. విత్తనశుద్ధితో పంటలో వచ్చే పురుగులు, తెగుళ్లను చాలా వరకు నివారించుకోవచ్చన్నారు. ఏడీఏ బాలాజీ నాయక్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరిక్షలు చేయించుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో భూసార పరీక్ష కార్డు ఉంటేనే రైతులకు ఎరువులు ఇచ్చే పరిస్థితి వస్తుందన్నారు. పంటల సాగులో యాజమాన్య పద్ధతులను ఉద్యానశాఖాధికారి రమేష్, నోడల్ ఆఫీసర్ సంధ్యారాణి వివరించారు. కార్యక్రమంలో కేవీకే, ఆత్మ, జిల్లా అనుబంధ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర



పూజలందుకుంటున్న పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు గ్రామంలో ఏరువాక పోలేరమ్మతల్లి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించారు. ముందుగా అమ్మవారి కలశాన్ని ఊరేగించి ఆలయానికి తీసుకొచ్చారు. పలువురు భక్తులు అమ్మవారికి వెండి వస్తువులు బహూకరించి 101 టెంకాయలు కొట్టి భక్తిని చాటుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో 4, టీడీపీ ఆధ్వర్యంలో 3 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు శ్రీకృష్ణ యాదవ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేశారు. గురువారం అమ్మవారికి కుంకుమ బండ్లు, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై జి.ప్రభాకరరెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారికి నైవేద్యాలు చెల్లిస్తున్న భక్తులు



బేస్తవారిపేట జంక్షన్ వద్ద పార్టీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



రాచర్ల నుంచి తరలి వెళ్తున్న నాయకులు



చినారికట్ల నుంచి యువత బైక్ ర్యాలీ

అడుగులన్నీ పొదిలివైపే..

- వైఎస్ జగన్ పర్యటనకు స్వచ్ఛందంగా తరలివెళ్లిన రైతులు
- పొగాకు రైతులకు మద్దతుగా కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

బేస్తవారిపేట/రాచర్ల/మార్కాపురం/తర్లుపాడు/కొనకనమిట్ల:

ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, రైతుల కష్టాలను నేరుగా తెలుసుకునేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం పొదిలి పర్యటనకు రాగా రైతులు, ఆ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరై మద్దతు తెలిపారు.

☛ గిద్దలూరు నియోజకవర్గంలోని బేస్తవారిపేట, గిద్దలూరు, కంభం, అర్ధవీడు, కొమరోలు, రాచర్ల మండలాల నుంచి రైతులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా బేస్తవారిపేట జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీలు బీవీ రాజయ్య, సారె వెంకట నాయుడు, పగడాల దేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు ఆవుల శ్రీధర్‌రెడ్డి, గొంగటి చెన్నారెడ్డి, ఏరువ రంగారెడ్డి, సీఆర్ఐ మురళి, ఓబులరావు, రవికుమార్, స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీ నెమిదిన్నె చెన్నారెడ్డి, ఇంటలెక్షువల్ వింగ్ అధ్యక్షుడు బిక్కా రామాంజనేయరెడ్డి, మాజీ ఎంపీపీలు గొటికె రాజేశ్వరరెడ్డి, రవికుమార్‌యాదవ్, పి.వెంకటరాజు, వైస్ ఎంపీపీ చిరంజీవి, డి.ఖాజా మీయా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా భాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు మల్లెల శేఖర్‌రెడ్డి, నాయకులు బొల్లా బాలిరెడ్డి, కొండా రఘునాథరెడ్డి, టీవీఎస్‌పీ శర్మ, రాచర్ల మండల నాయకులు సూర స్వామిరంగారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ బద్దీటి ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ సూర పాండురంగారెడ్డి, ఎంపీటీసీ నందం రవి, మాజీ కోఆప్షన్ సభ్యుడు పల్నాటి మహబుబ్‌పీరా, బత్తుల శివకుమార్‌యాదవ్, సీహెచ్.ఇబ్రాహిమ్, పిచ్చిరెడ్డి, శనిగ నారాయణ, సొంటం రమణరెడ్డి, నెమిలిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, యల్లా చంద్రమోహన్, విశ్రాంత తహసీల్దార్ చల్లా వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, పాల్గొన్నారు.

☛ మార్కాపురం మండల నాయకులు నజీర్ అహ్మద్, గుంటక చెన్నారెడ్డి, పీఎల్పీ యాదవ్, పత్తి రవిచంద్ర, బొగ్గరపు శేషయ్య, సతీష్, రంగ నాయకులు, సలీమ్, కొత్త కృష్ణ, కరీముల్లా, సుంకయ్య, తర్లుపాడు నుంచి పార్టీ మండల అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, పార్టీ నేతలు రామిరెడ్డి, కుందురు సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు పెద్ద మస్తాన్, కె.రమణారెడ్డి, ఎబినైజర్, దాసయ్య, గుమ్మా రాజేంద్ర ప్రసాద్, కొనకనమిట్ల నుంచి ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ అధ్యక్షుడు మోరా శంకర్‌రెడ్డి, ఉడుముల గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తర్లుపాడు నుంచి..



మార్కాపురం నుంచి పొదిలి వెళ్తున్న నాయకులు



రాచర్ల మండలం అనుమలవీడు నుంచి..





కొనకనమిట్ల నుంచి వెళ్తున్న మహిళలు

అభిమానానికి అభివాదం

పొగాకు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు బుధవారం పొదిలి వచ్చిన వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా రైతులు, పార్టీ శ్రేణులు తరలివచ్చారు. వారందరికీ అభివాదం చేస్తూ వైఎస్ జగన్ ముందుకు సాగారు.









